వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 14 ఆగష్టు 2024

ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలను వింటున్న రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రైతు కంట నీరు తుడిచేందుకే...

భూమి సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల నిర్వహణ

రాష్ట్ర రవాణా క్రీడాశాఖామాత్యులు, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పారదర్శకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తాం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

రాష్ట్రంలో నెలకొన్న భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని రాష్ట్ర రవాణా క్రీడల శాఖామంత్రి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా మంత్రి అధ్యక్షతన రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మంత్రి మాట్లాడుతూ మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ 5 సంవత్సరాలలో చేయాల్సిన పని ఏదైనా ఉందంటే అది రైతు కంట్లో నీరు తుడిచే బాధ్యత ఆ బాధ్యతను నెరవేర్చడానికి ఇంత త్వరగా రెవెన్యూ సదస్సులు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడంఎపై సీఎంకు, రెవెన్యూ మంత్రికి మనందరి తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. భూములను మనకు చేరువ చేసే బాధ్యత రెవెన్యూ అధికారులదే అని రెవెన్యూ వ్యవస్థలో జరిగిన చిన్న చిన్న పొరపాట్ల వల్ల చాలా మంది రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని సరైన పాసు పుస్తకాలు, వన్‌బి అడంగల్ తదితర వాటిపై ట్యాంపరింగ్ జరిగిందని రైతులు వస్తున్నారని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.వంశ పారంపర్యంగా వస్తున్న భూమి మన పేరున లేకపోతే ఎంత నరక యాతన అనుభవిస్తామో మనందరికి తెలుసు కాబట్టి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ పరంగా ఏవైతే భూ సమస్యలున్నాయో వాటిని పరిష్కరించే దిశగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15న జిల్లా మంత్రి లాంచనంగా ప్రారంభించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయన్నారు. ఆయా మండలాల్లోని తహసీల్దార్లు, డీటీ, ఆర్ఐ, వీఆర్వో మండల సర్వేయరు గ్రామసర్వేయర్ ఫారెస్టు దేవాదాయ తదితర అధికారులు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించామని జేసీతో పాటు ముగ్గురుసబ్ కలెక్టర్లు స్పెషల్ అధికారులుగా నియమించడం జరుగుతుందన్నారు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల షెడ్యూలు ముందుగానే ప్రకటిస్తామని తెలిపారు. భూమి సమస్యల పరిష్కారానికి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై శాసనసభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధులు, తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, రైల్వేకోడూరు, రాజంపేట ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రాన్ని సందర్శించిన ఎస్పీ

చక్రాయపేట, ఆగష్టు 13, ప్రభాతవార్త:

గండి వీరాంజనేయ స్వామిని జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు మంగళవారం అంజన్న దర్శించుకున్నారు తలుతగా అయనకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి రాజా స్వాములు స్వాగతం పలికారు. ఆయన స్వామివారిని అడిగి తెలుసుకున్నారు అలాగే శ్రావణమాస ఉత్సవాలు ఎలా జరుగుతున్నాయని అన్ని ఎర్పాట్లు పగడ్బందీగా ఉన్నాయని అంశంపై అర్చకులను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయనకు సన్మాన కార్యక్రమం పూజారులు చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు అనంతరం చక్రాయపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా ఎస్పీ హర్షవర్దన్ రాజు తనిఖీ చేశారు అలాగే మండల పరిస్థితిపై ఆయన ఎస్సై కృష్ణయ్య అడిగి తెలుసుకున్నారు ఆయన స్టేషన్ నందు రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ బదిలీ

కడప క్రైం, ఆగస్టు 13, ప్రభాతవార్త:

వైఎస్ఆర్ జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అదనపు ఎస్పీగా పనిచేస్తున్న జి.వెంకట రాముడును ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో 2012 బ్యాచ్‌కు చెందిన జి.వెంకట రాముడును ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఈయన గతంలో కర్నూలు అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల ముందు జనవరిలో జిల్లాకు ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఎన్నికల సమయంలోనూ, ఎస్ఈబీ విభాగంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

రెండు చోట్ల 80బస్తాలు బియ్యం స్వాధీనం

దువ్వూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరుకు సమీపంలో రెండు చోట్ల సోమ, మంగళవారాల్లో 80 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. నేలటూరు మెట్ట వద్ద బొలేరో వాహణంలో 52బస్తాలు బియ్యం తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండల కేంద్రమైన దువ్వూరులో ఓ ఇంటిలో 18బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బొలేరో వాహణంలో 2500కేజీల బియ్యంతో పాటు వాహణాన్ని కూడ సీజ్ చేశామన్నారు. ఇంటిలో స్వాధీనం చేసుకున్న 800కేజీల బియ్యాన్ని మండల తహసీల్దార్ కార్యాలయానికి అప్పగిస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీ ఆదేశాలతో పేకట స్థావరాలపై దాడులు

- భారీగా నగదు స్వాధీనం - 16మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ముద్దనూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని కడప-తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో యామవరం నాడు మంగతాయి, కాయిన్స్ రూపంలో లోపల బయట జూదం ఆడుతున్న 16మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, 2,25,380 నగదు, రెండుకార్లు, నాలుగు ద్విచక్ర వాహణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. కడప జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులకు ముందస్తు రాబడిన సమాచారం మేరకు కొండాపురం సీఐ మహమ్మద్ రఫి, ఎస్ఐ విద్యాసాగర్ తోటి సిబ్బందితో దాడులు నిర్వహించి, మంగతాయి ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. జూదం ఆడుతున్న వారిలో యామవరం గ్రామం ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల పట్టణాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. ఈ దాడులలో మరికొందరూ వ్యక్తులు తప్పించుకున్నట్లు సమాచారం. వారిని కూడ త్వరలో అదుపులోకి తీసుకొని ఇటువంటి స్థావరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మంగతాయి ఆడుతున్న వ్యక్తులను ముద్దనూరు పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటువంటి స్థావరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు,

మంత్రి సత్యకుమార్‌లను కలిసిన కొనిరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మంగళవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఆయన జిల్లా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబుకు వివరించారు. అనుడా(అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుండి తమ పంచాయతీకి రావలసిన రిజిస్ట్రేషన్ స్టాంట్ డ్యూటీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా గత ప్రభుత్వాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గడిచిన 34సంవత్సరాలుగా మైనర్ పంచాయతీలకు నూరు రూపాయలు, అలాగే మేజర్ పంచాయతీలకు 250రూపాయలు ఇస్తుండగా, డిప్యూటి సీఎం పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్‌కళ్యాన్ ప్రస్తుతం ఏర్పడ్డ నూతన ప్రభుత్వంలో మైనర్ పంచాయతీలకు 10వేలు, మేజర్ పంచాయతీలకు 25వేల వరకు పెంచడంతో జిల్లా సర్పంచులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంధర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లాలో సర్పంచుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి పదవి పొందడంపైఔ సత్యకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధితో పాటు రోగులకు మెరుగైన వైద్యం అందేలా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అలాగే ఆకస్మిక తనిఖీలు చేస్తూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నారని, ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అలాగే చుట్టుప్రక్కల గ్రామాల నుండి ఎంతోమంది గర్భిణీలు ప్రసవం కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి వస్తుంటారని తెలిపారు. సిజేరియన్ కేసులను ఇతర ప్రాంతాలకు సిఫార్సు చేయకుండా వారందరికి ఇక్కడే ఆపరేషన్లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో తగినంతమంది వైద్య సిబ్బందిని నియమించాలని, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తన సొంత పట్టణమైన ప్రొద్దుటూరు ఆసుపత్రికి అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కొత్తపల్లె పంచాయతీ 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్దన్ రెడ్డి ఉన్నారు.

రాజంపేట డివిజన్‌లో 27వేల ఎకరాల

ఫ్రీ హోల్డ్ భూముల విచారణకు శ్రీకారం

సుండుపల్లి మండలంలో సబ్ కలెక్టర్ పరిశీలన

రాజంపేట అర్బన్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

భూ అక్రమాలపై విచారణకు జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అసైన్డ్ భూములను పెద్ద ఎత్తున ఫ్రీ హోల్డ్ చేసి అమ్ముకునేందుకు చేసిన ప్రయత్నాలు అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేసిన భూములను విక్రయించేందుకు అవకాశం లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపధ్యంలో ముందు క్షేత్రస్థాయిలో భూముల పరిశీలనకు రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి సుండుపల్లి మండలంలో మొదట ప్రారంభించారు. సుండుపల్లి మండలం పులిమేరపల్లి గ్రామంలో ఫ్రీ హోల్డ్ భూములను సబ్ కలెక్టర్ నిదియా దేవి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మరకు రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో భూములను పరిశీలించేందుకు రికార్డులు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. డివిజన్‌లో సుమారు 27వేల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములు ఉన్నట్లు సమాచారం. ఒక్క రాజంపేట మండలంలో మాత్రమే 2003కు సంబంధించి 3వేల ఎకరాల భూములు ఫ్రీ హోల్డ్‌లో ఉన్నట్లు ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. మండలంలో పెద్దఎత్తున భూ అక్రమాలు జరిగినట్లు కలెక్టరుకు ఫిర్యాదులు వెల్లినట్లు సమాచారం.

నేటి విద్యార్థులే రేపటి మార్గ దర్శకాలు

ఖాజీపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త:

నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మైదుకూరు ఇన్చార్జి ఆర్.హరిక తెలిపారు. మండల కేంద్రంలోని జి.సుంకేసుల గ్రామం వద్ద గల కస్తూర్బా గాంధి పాఠశాలను జడ్జి హరిక మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా పాఠశాలలోని విద్యార్థినిలతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేటి సమాజం ఎదుగుదలకు విద్యార్థుల పాత్ర ఎంతో అవసరం అన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని విద్యార్థినీలకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలోని తరగతి గదులు, భోజనశాల, మరుగుదొడ్లను జడ్జి పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రార్థణా కార్యక్రమంలో విద్యార్థినిలతో పాటు జాతీయగీతాన్ని జడ్జి ఆలపించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాల వెంకటయ్య, సీనియర్ లాయర్లు పి.వి నారాయణ రెడ్డి, కె.శ్రీనివాసులు, నాగిరెడ్డి, శివరామకృష్ణ, కోర్టు సిబ్బంది సుభాష్ రెడ్డి, రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, సిబ్బంది కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

రచ్చ..రచ్చగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

చాపాడు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణం నందు మంగళవారం ఎంపీపీ లక్ష్మయ్య అధ్యక్షతన 18వ విడత సామిజిక తనిఖీ ప్రజా వేదిక రచ్చ..రచ్చ వాదోపవాదాల మధ్య ముగిసింది. మహాత్మా గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 7.13కోట్ల వ్యయంతో, 5.98 వేతనాలు, 1,15సామాగ్రి రూపంలో, 1388 పనులకు ఖర్చు చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఏపీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరత్నమ్మ హాజరయ్యారు. మండలంలోని ఖాదర్ పల్లి గ్రామంలో మాస్టర్ వెరిఫికేషన్ నందు ఏపీఓ సంతకం లేదని 5000 జరిమాణా వేశారు. అన్నవరం గ్రామ పంచాయతీలో క్షేత్ర సహాయకుడు భార్య కూలి పనికి హాజరు కాకపోయిన దొంగ మస్టర్లు వేసుకున్నట్లు గ్రామస్థులు తెలియజేయడంతో విచారణకు ఆదేశించారు. పల్లవోలు గ్రామపంచాయతీలో తనిఖీ సమయంలో నేమ్ బోర్డులు లేకపోవడంతో 10,500 రికవరికి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 22గ్రామ పంచాయతీలలో వివిధ రూపాలలో 3,27,000 ఉపాధి నిధులు వృధా కాకుండా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జుబేదమ్మ, అధికారులు, స్టేట్ రిసోర్స్ పర్సన్ కన్నారెడ్డి, డిఆర్పీలు, గ్రామ పంచాయతీల ప్రజలు పాల్గొన్నారు.

ఆగస్టు 15వేడుకల్లో మాజీ సైనికులు పాల్గొనాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 13, ప్రభాతవార్తం

ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడ మన ప్రొద్దుటూరు డివిజన్ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో సైనికులు, మాజీ సైనికులు మరియు వీర నారీమణులందరూ విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేట్ల బాల వీరారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో 15వ తేది ఉదయం 7 గంటలకు ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించి అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి టీబీ రోడ్డులో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులు అర్పించి అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ హైస్కూల్ ఎగ్జిబిషన్ మైదానంలో జాతీయ జెండా వదనము చేయడం జరుగుతుందని అందరూ ఉదయం 7గంటలకు గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్దకు రావాలని కోరారు.

ప్రణాళిక బద్ధంగా సాగునీరు అందిస్తాం-ఎమ్మెల్యే పుట్టా

దువ్వూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

మైదుకూరు నియోజకవర్గంలోని కేసీ కెనాల్, తెలుగు గంగ ప్రాజెక్టుల ద్వారా ప్రణాళిక బద్ధంగా సాగునీరు అందిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చల్లబసాయిపల్లె తెలుగు గంగ రిజర్వాయర్ నుండి చెన్నముక్క పల్లె కాలువ అలాగే ఏ నుండి బి రిజర్వాయర్‌కు వెల్లే కాలువను ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన స్థానిక పరిస్థితులపై తెలుగుగంగ అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా 3000క్యూసెక్కుల నీరు వస్తుందని ఈ నీటితో నియోజకవర్గంలోని 6చెరువులకు నీరు వదులుతామన్నారు. ఇప్పటికే చింతకుంట, మైదుకూరు ఎర్ర చెరువుకు నీటిని వదిలామని మిగతా చెరువులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు గంగ ప్రాజెక్టుకు వస్తున్న నీటిని ప్రణాళిక బద్ధంగా బి.మఠం రిజర్వాయర్‌కు అలాగే చెరువులకు అందేవిధంగా మూస్తామన్నారు. 2014-19లో సుమారు 320కోట్లతో వెలుగోడు ప్రాజెక్టు వద్ద 0 నుండి 18కిలోమీర్ల వరకు లైనింగ్ చేయడం వల్ల ప్రస్తుతం ఈ నీరు వస్తుందన్నారు. ఈ నీటిని ప్రణాళిక బద్ధంగా ప్రజలకు, రైతులకు అందిస్తామన్నారు. ఎక్కడైనా మరమ్మత్తులు చేయాలంటే వారి ప్రతిపాదనను అధికారులు అందిస్తే ప్రభుత్వం ద్వారా నిధులు తెప్పిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఏఈ నాగిరెడ్డి, మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, సంజీవరెడ్డి, ఉశేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18న ఆర్యవైశ్య సభ 134వ వార్షిక సమావేశం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ నిబంధనావళిని అనుసరించి 134వ వార్షిక సర్వసభ్య సమావేశము స్వస్తి శ్రీ శ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ శుద్ధ చతుర్థికి అనగా 18-08-2024వ తేది ఆదివారము ఉదయం 10:30నిమిషాలకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానము(అమ్మవారి శాల) నందు ఏర్పాటు చేయడం జరుగుననికావున ఈ సమావేశమునకు ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ సంఘ సభ్యులు మరియు 18సంవత్సరములు పైబడిన ఆర్యవైశ్యులందరూ పాల్గొనవలసిందిగా ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో యాచకుడు మృతి

ముద్దనూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త:

ముద్దనూరు పాత బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని యాచకుడు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులకు సమాచారం రావడంతో ఏఎస్ఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుని దగ్గర వివరాలు పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో పంచనామా నిమిత్తం మృతదేహాన్ని పంచాయతీ అధికారులకు అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధుల అప్రమత్తతపై అవగాహన

నిమ్మనపల్లె, ఆగస్టు 13 ప్రభాతవార్త :

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించుకొని అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు నిమ్మనపల్లె మండలంలోని తవళం గ్రామంలో డాక్టర్ రమేష్‌బాబు పర్యవేక్షణలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దలు బిసిజి టీకాలపై, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్‌లు అవగాహన కల్పించారు. డెంగీ జ్వరాలు, మలేరియా వంటి అంటువ్యాధులు సీజనల్ వ్యాధుల్లో ప్రబలే అవకాశం అధికంగా ఉండడంతో ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. పిల్లలందరికి అల్బండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ సరోజ, ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, ఎంఎల్‌హెచ్‌పి కరుణ, ఏఎన్ఎం సిద్దమ్మ ఆశా కార్యకర్తలు శ్రావణి, ఎల్లమ్మ, మంజుల గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో వ్యయం రూ.6.84కోట్లు

రికవరి రూ.20,297లు

కురబలకోట, ఆగస్టు 13 ప్రభాతవార్త:

కురబలకోట మండలంలో ఉపాధిహామీ పథకం కింద వివిధ పనులకు గానూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.84కోట్లు ఖర్చు చేయగా, రికవరి రూ.20,297లు చేసినట్లు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేధిక సభను నిర్వహించారు. రూ.6.84 కోట్లుకు గానూ వేతనదారులకు రూ.4.83కోట్లు, మెటిరీయల్స్ కింద రూ.2.01కోట్లను సర్వశిక్ష అభియాన్ పంచాయితీరాజ్ తదితర డిపార్ట్‌మెంట్స్‌లో నిధులను ఖర్చు చేశారు. ఇందులో రూ.20,297లు రికవరికి జిల్లా ఏపిడి రవికుమార్ ఆదేశించారు. చేసిన పనుల వద్ద సమాచారబోర్డును ఏర్పాటు చేయాలని, చనిపోయిన మొక్కల స్థానంలో మొక్కలు నాటించాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సామాజిక బహిరంగసభలో ఏపిడి మధుబాబు, ప్రోసిడింగ్ అధికారి రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, డిఆర్‌డిఏ డిపిఎం ధర్మరాజు, ఎస్ఆర్‌పి సుబ్బరావు, ఎంపిడిఓ హరినారాయణ, ఏపిఓ వెంకటేష్, జడ్పిటిసి బైసాని జ్యోతి, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, టిడిపి మండల కన్వీనర్ వైజి సురేంద్ర, మాజీ ఎంపిపి భూమిరెడ్డి, సర్పంచ్‌లు సురేంద్ర, డిఆర్.వెంకటరమణలు, జంగా రాఘవరెడ్డి, తుమ్మచెట్లపల్లె సూరి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అవయవధానం పూర్వజన్మ సుకృతం

కురబలకోట, ఆగస్టు 13 ప్రభాతవార్త:

అవయవదానం పూర్వజన్మ సుకృతమని ముఖ్య అతిధి అసోసియేట్ ప్రొపెసర్ ఎం.శ్వేత అన్నారు. మంగళవారం మిట్స్ కళాశాలలో ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చనిపోయిన వారినుంచి సేకరించిన అవయవాలను 8మందికి ఏర్పాటు చేయవచ్చునని తెలిపారు. ఈ విషయాన్ని సమాజంలో అధికశాతం చాలమందికి తెలియదని తెలిపారు. అందరికి దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరణించిన వారి నుంచి నిర్ణయిత సమయంలో సేకరించి సత్ప్రవర్థనకలిగిన వారికి ఏర్పాటు చేయడం వల్ల పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం, కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు విద్యార్థులచే ర్యాలీ

రామసముద్రం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మండలంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలంటూ ప్రతి గ్రామంలో నూ పండగ వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కోరుతూ మండల టిడిపి అధ్యక్షులు విజయకుమార్‌గౌడ్, తహశీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. పాఠశాల విద్యార్థులతో కలపి మండల కేంద్రంలోన ర్యాలీ నిర్వహించారు. తూర్పు పాఠశాల నుంచి జడ్పి హైస్కూల్ మీదుగా విద్యార్థులు జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చంద్రమోహన్, మంజునాథ్, ఉమా, శ్రీదేవి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాలువలను తలపిస్తున్న రోడ్డు

రామసముద్రం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

రామసముద్రం-పుంగనూరు మార్గంలో గుంతయంబాడి గ్రామం వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రయాణీకులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు ఎటూ పోలేక రోడ్డుపైకి నిలిచిపోయింది. ఆర్‌అండ్‌బి అధికారులు చర్యలు తీసుకఒంవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

మిట్స్‌కు జాతీయస్థాయి గుర్తింపు

కురబలకోట, ఆగస్టు 13 ప్రభాతవార్త:

మిట్స్ కళాశాలకు జాతీయస్థాయి అరుదైన గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. దేశంలో అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిందని ఇందులో 201నుంచి 300వస్థానం కళాశాలగా గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు. ఎన్‌పిటిఈఎల్ నేషనల్ ఇనిస్యూట్‌ఆఫ్ ర్యాంకింగ్ ప్రేమ్‌వర్క్ కింద యూనివర్శిటిలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, తదతర 13 విభాగాల్లో ఈ ర్యాంకు తరలిస్తారని తెలిపారు.ఇందులో మిట్స్‌కు ఈ ఘనత లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి అధ్యాపకులకు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైదుకూరులో ఘనంగా హర్‌ఘర్ తిరంగ యాత్ర

మైదుకూరు ఆగష్టు 13, ప్రభాతవార్త :

ఆజాద్ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులతొ పాటు, ప్రజల హృదయాలలో దేశ భక్తి భావాన్ని పెంపొందించడానికి హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు మైదుకూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మాచునూరు సుబ్బరాయుడు తెలిపారు.అందులో భాగంగా సోమవారం ఉదయం మైదుకూరు మండల కేంద్రంలొని అర్టీసి బస్టాండ్ ఆవరణంలో గల అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి,హర్‌ఘర్ తిరంగ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వతేది వరకు భారతదేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ప్రతి ఒక్కరు తన ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి సూచించారన్నారు.జాతీయజెండా ఎగురవేయడాన్ని ప్రోత్సహించేందుకు హర్‌ఘర్ తిరంగ కాలర్ ట్యూన్ ను అందరి ఫోన్‌లలో వినిపించాలన్నారు. ప్రధానమంత్రి మోడి ప్రారంభించిన హర్‌ఘర్ తిరంగ ప్రచారం రెండేళ్లకే జాతియ ఉద్యమంగా మారడం సంతోషంగా ఉందన్నారు. దేశభక్తితొపాటు భారతజాతీయ జేండా గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చాపాడు, దువ్వూరు, బి.మఠం, ఖాజీపేట, మైదుకూరు మండల బిజెపి అధ్యక్షులు, మరియు పాఠశాల విద్యార్థులు, కాలేజి విద్యార్థులు, అర్బన్ ఇన్-స్పెక్టర్ ఎపి.మస్తాన్, జయరామి రెడ్డి, యల్.సి.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త:

మండలంలో వాటర్ ప్లాంట్‌లు పుట్ట గొడుగుల్లా పుట్టుకువచ్చాయి. స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉన్న మినరల్ వాటరే చాలా మందికి కావాలి ఈ దశలో మినరల్ వాటర్ నీరు ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో అందుతుందా లేదా అనే విశయాన్ని సంబంధిత అధికారులు గుర్తించాల్సి ఉంది. అయితే ఇది నిబంధనల మేర నడిపే మినరల్ వాటర్ ప్లాంట్ల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. అసలు వాటర్ ప్లాంట్‌లు నిబంధనల మేరకు నడుస్తున్నాయా లేదా అని అధికారులు పరిశీలించాలి. అయితే సంబంధిత అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పుట్టగొడుగుల్లా వీధికో వాటర్ ప్లాంట్ ఏర్పాటుఅవుతున్నాయని కాంగ్రేస్ నాయకులు మహమ్మద్ ఫయాజ్ అన్నారు. వాటి నాణ్యత ప్రమాణాలపై దృష్టి పెట్టాలని కాంగ్రేస్ నేత మహమ్మద్ ఫయాజ్ డిమాండ్ చేస్తున్నారు. మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అనుమతి గల వాటర్ ప్లాంట్లను గుర్తించడమే కాక అనుమతి లేని ప్లాంట్లను సీజ్ చేయాలని కోరుతున్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ

చిట్వేలి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

చిట్వేలి మండలం చెర్లోపల్లి పంచాయతీలో కార్యదర్శి కేశవరెడ్డి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై హెచ్ఎం రామ్మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పిల్లలచే గ్రామ వీధుల్లో తిరిగి జాతీయ పతాక ప్రాధాన్యతను వివరిస్తూ స్వాతంత్ర్య సముపార్జనలో అశువులు బాసిన అమరుల త్యాగాన్ని కొనియాడుతూ జేజేలు పలికారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ జెండా ఎగరాలని, వేడుకల్లో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు వస్త్రదానం

బద్వేలు అర్బన్, ఆగస్టు13 (ప్రభాతవార్త):

పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహంలోని అనాథ వృద్ధులకు మంగళవారం శ్రీభవాణి ప్రైడ్ గ్రామ్ మిల్ ఓనర్ కొలిశెట్టి క్రిష్ణయ్య, సతీమణి రాణి, కుమార్తె చరిష్మ, కొట్రా శేషునాథ్‌ల 3వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమంలోని 20 మంది వృద్ధులకు చీరెలు, జాకెట్లు, పంచెలు, తినుబండారాలు అందజేశారు. అనంతరం పలువురు ఈ సందర్భంగా వృద్ధులు క్రిష్ణయ్య కుమార్తె, అల్లునికి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇలాంటి సేవా కార్యక్రమాలు ముున్ముందు రోజులలో కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సాయి, సాత్విక్, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ కా తిరంగా ర్యాలీ నిర్వహింపడినది

చక్రాయపేట,ఆగష్టు 13,ప్రభాతవార్త:

భారత ప్రధానమంత్రి గౌరవనీయులు నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈ రోజు చక్రాయపేట మండల సురభి నాగలగుట్టపల్లి గ్రంథాలయం నందు హర్‌ఘర్ కా తరింగా ర్యాలీ నిర్వహింపబడినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ మరియు ఎన్డీఏ కూటమి పార్టీ సభ్యులు పాల్గొని నాగులగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విద్యార్థులు కలిసి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించబడినది ఈ ర్యాలీలో అఖండ భారత్ తెలుపుతూ వందేమాతరం నిలదీస్తూ కార్యక్రమం విజయవంతం చేశారు తొలత గ్రంథాలయము నందు స్వామి వివేకానంద గారికి భరతమాతకు పూలమాలలు వేసి పుష్పాంజలు ఘటించి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి నేషనల్ కౌన్సిలర్ నెంబర్ కె రామచంద్ర రెడ్డి గారు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్ సుమన్ బీజెపైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సోము దశరథ రాయల్ తెలుగుదేశం పార్టీ నుండి సానే స్వురామయ్య దాసరి రామకృష్ణ నెక్కంటి ఎల్లయ్య వగడాల పరమేశ్వర జనసేన పోలిశెట్టి పాయికుమార్ చెంచయ్య బద్రి రాయల్ కుమార్ పవన్ కుమార్ జిల్లా పరిషత్ హెడ్మాస్టర్ సంజీవ్ కుమార్ వెంకటేశ్వర్లు తదితర దేశ భక్తులు అనేకమంది పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానం గండి క్షేత్రము

చక్రాయపేట,ఆగష్టు 13 ,ప్రభాతవార్త:

శాశ్వత నిత్యాన్నదాన పథకాన్ని ప్రొద్దటూరు పట్టణం మొదంపల్లి వాస్తవ్యులు కృష్ణమోహన్ రెడ్డి 1,01,116 /- రూపాయల చెక్కును ఇఒ గారికి అందజేశారు వీరికి ప్రధాన అర్చకులు కేసరి స్వామి తీర్థ ప్రసాదములు అందజేశారని జె.వెంకటసుబ్బయ్య అసిస్టెంట్ కమిషనర్ మీడియా మిత్రులకు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తొండూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃతొండూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.00గంటలకు ఎంపీపీ రావులకొలను నారాయణమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విష్ణుప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులందరు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

- కొండాపురంలో ఃకొండాపురం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు మండలాధ్యక్షురాలు సి.లక్ష్మిదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.పి.నాగప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులందరు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ లోపం క్షమించరాని నేరం

వేంపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃరాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ లోపం క్షమించరాని నేరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించారని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయని కారణంగా పులివెందుల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు, అలాగే అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని తెలిపారు. ఈనెల 10న తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొఉట్టకుపోయి, రిజర్వాయరులోని నీరంతా సముద్రం పాలైదన్నారు. నిర్వహణ సరిగా లేదని నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, ధవళేశ్వరం, సోమశిల, మైలవరం, సుంకేసుల, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వమైనా ప్రాజెక్టుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వహణకు నిధులు విడుదల చేసి సిబ్బంది కొరత లేకుండా చూడాలని తులసిరెడ్డి కోరారు.

స్కూటీలోని రూ.30వేలు డబ్బులు చోరీ

వేంపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃవేంపల్లెలోని సాయిబాబాగుడి సమీపంలో ఉంచిన స్కూటీలోని రూ.30వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు కె.రామచంద్రారెడ్డి తెలిపారు. వేంపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి అనే రైతు బ్యాంకులో బంగారుపెట్టి రుణాన్ని తీసుకున్నారన్నారు. రుణం చెల్లించేందుకు డబ్బులు తీసుకుని సోమవారం బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకులో డబ్బులు కట్టిన తరువాత మిగిలిన రూ.30వేలు స్కూటీలోని సంచిలో పెట్టుకుని సాయిబాబాగుడి దగ్గరకు వెళ్లినట్లు బాధితుడు తెలిపారు. గుడి వద్ద స్కూటీ పెట్టి సమీపంలోని దుకాణం వద్దకు వెళ్లి పెరుగు ప్యాకెట్ తీసుకుని వచ్చేలోగానే గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీని తెరిచి అందులో ఉన్న రూ.30వేలు నగదును అపహరించినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. డబ్బులతో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డును కూడా దొంగలించారని బాధితుడు వాపోయారు.

16న శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

పులివెందుల రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃపులివెందుల పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 14 నుండి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ తూగుట్ల రామచంద్రారెడ్డి, కమిటి సభ్యులు తెలిపారు. 14న పంచలోహ శ్రీచక్రప్రతిష్ఠ అమ్మవారి ఆలయంలో గణపతిపూజ, స్వస్తివాచనం, కలశస్థాపన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే అగ్నిప్రతిష్ఠ, మహాగణపతి హోమం నిర్వహిస్తారన్నారు. 15న గురువారం వివిధ పుణ్యనది జలాల పంచగవ్య, సుగంధద్రవ్య సహిత బింబశుద్ధి, మహాస్నపనం, అష్టోత్తర కలశాభిషేకం, శ్రీమన్నారాయణ మహాలక్ష్మిల సుదర్శన హోమం, ధాన్యాధివాసములు నిర్వహిస్తారన్నారు. 16న బ్రహ్మ ముహూర్తమున శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, శ్రీమహాలక్ష్మి సరస్వతి దుర్గ లలిత హోమములు, 108 రకాల వివిధ ఫల, పుష్ప, సుగంధద్రవ్య పట్టువస్త్ర వాయన సహిత మహా పూర్ణాహుతి, శిఖర కలశాల సంప్రోక్షణ, మహానివేదన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం నుండి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. మహిళలకు అమ్మవారి ప్రసాదం గాజులు, కుంకుమ ఇస్తారన్నారు. సాయంత్రం కోలాటాలు, వివిధ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ సవాల్‌కు మేము సిద్ధమే

పులివెందుల, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పులివెందుల హౌసింగ్‌లో ఆవినీతి జరిగిందని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పులివెందులలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కేవలం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నమో లేక వారి అవగాహనా రాహిత్యంతో చేసిన ఆరోపణలతో నివేదికలతో ఈ రోజు కొన్నివేల మంది పేదలు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తోందన్నారు. ఏదేశంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా ప్రజలకు ఏదైనా పథకం మంజూరు చేసే నాటికి అర్హత ప్రామాణికంగా తీసుకుని గృహాలు లేదా సంక్షేమ పథకాలు కానీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కానీ 2020-21లో మంజూరైన గృహానికి 2024లో అర్హత ప్రామాణికంగా తీసుకుని వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం, గతంలో జరిగిన దాఖలాలు లేవన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా నిరుపేదలు, మున్సిపాలిటీ కార్మికులు, అలాగే రూ.12వేలలోపు నెలసరి ఆదాయం ఉన్న చిరుద్యోగులు అంటే అంగన్వాడీ, ఆశవర్కర్లకు గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెసులుబాటు కల్పించి వారికి గృహాలు మంజూరు చేసిందన్నారు. ఇప్పుడు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా సాకు చూపుతూ వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయం కాదా అని వారు ప్రశ్నించారు. ఇంకా ఇలాంటి ఎంతో మంది పేదలు ఈరోజు దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారులు పంపిన షోకాజ్ నోటీసులు పట్టుకుని మా వద్దకు వస్తున్న పరిస్థితి ఉందన్నారు. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పటి నుండి మొన్నటి వరకు పులివెందులలో మంజూరైన టిడ్కో గృహాలపైన విచారణ వేయాలని వారు డిమాండ్ చేశారు. పేద ప్రజల ముసుగులో కొన్ని వందల గృహాలు అడ్డగోలుగా బినామీల పేర్లతో తీసుకుని ఇప్పటికీ అద్దె వసూలు చేస్తున్నారనేది అప్పుడు అర్థం అవుతుందన్నారు. కబ్జాలు, భూ వివాదాలు, ఎస్సీ, ఎస్టీల భూములను లాక్కుని తమ పేరు మీద రికార్డులు మార్చుకున్న ఘనత తెలుగుదేశం పార్టీ నాయకులదే అన్నారు. 2014 తరువాత అసైన్డ్ భూములు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి చిట్టా గురించి విచారణ అడుగుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పేర్ల మీద ఉన్న భూములు ఎవరి పేర్లమీదకు రికార్డుల్లో మారిందో అర్థం అవుతుందన్నారు. పులివెందులలో తెదేపా ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి చేశారో, వైఎస్ హయాంలో, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందనే దానికి ఎక్కడికైనా వచ్చి మా చిత్తశుద్ధి నిరూపించుకోవడానికి మేము సిద్ధం అన్నారు. మీరు అవినీతి జరిగిందని చెప్పి 2400మంది పేదల గృహాలు తొలగించినా వారంతా కూడా అతి త్వరలోనే తెలుగుదేశం పార్టీని, వారి ఇళ్లను ముట్టడించి, వారి బాధను వెళ్లగక్కే పరిస్థితి త్వరలోనే వస్తుందన్నారు. వైఎస్ కుటుంబం తరపున పేద ప్రజలందరికీ ఒక్కటే చెబుతున్నాం.. కొన్నిరోజులు ఓపిక పట్టండి.. మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తుంది.. ప్రస్తుతం వెనక్కు తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఇంటికి తిరిగి మంజూరు చేయించే బాధ్యత మాది అని వైకాపా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనరు హాల్ గంగాధర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ హఫీజ్, నూర్‌బాషా కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రసూల్, జేసీఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, డేనియల్, కోఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

మినీ బస్సు బోల్తా.. ఒకరు మృతి

పులివెందుల, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃశ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం దాడితోట సమీపంలో పులివెందుల నుండి అనంతపురం వైపు వెళ్తున్న మినీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనలో మినీ బస్సులో ప్రయాణిస్తున్న సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బోనాల హరీష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో 10మందికి దాకా గాయాలయ్యాయి. గాయపడిన వారిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పాలాలు సందర్శన

పులివెందుల, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃపులివెందుల మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న అరటి, టమోటా, బంతి, తదితర పంటలను మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి పరిశీలించారు. మంగళవారం రైతులతో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగుతో ఎలాంటి లాభాలు చేకూరాయి, తదితర విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పులివెందుల రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃపులివెందులలో మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 ఆధ్వర్యంలో విద్యార్థులు హర్ ఘర్ తిరంగా అనే ర్యాలీలో పాల్గొన్నారు. పూలంగళ్ల సర్కిల్ వరకు స్వాతంత్ర్య సమరోత్సవ నినాదాలు పలుకుతూ సాగారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, వైస్‌ప్రిన్సిపల్ సుధీర, డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 పీవోలు శ్రీనిత, శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ సుగుణ, కె.విజయలక్ష్మి, రాధిక, రెడ్డెమ్మ, హేమ, గంగిరెడ్డి, వాణి, లిఖిత, ఓబుళపతి, మహేంద్ర, గౌతమి, రమీజ, సృజన, ప్రిన్సిపల్ బృందం పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ

కడప లీగల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

కడప జిల్లా పెండ్లిమర్రిలో గల కస్తూర్బాఆ గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనం, తరగతి గదులను, లైబ్రరీ, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. పిల్లలు క్రమ

పరిశ్రమలకు నందలూరు అనువైన ప్రదేశం

నందలూరు,ఆగష్టు 13,ప్రభాతవార్త:



ఉమ్మడి కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు మండలం పరిశ్రమలకు అనువైన ప్రదేశం అని టి.ఎన్.ఎస్.ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ను కలిసి నందలూరు మండలం నందు గతంలో అల్విన్ కర్మాగారం ఉండేదని అందులో సుమారు 2000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగాను పరోక్షంగా 1000 మంది దాకా ఉపాధి పొందుతూ ఉండే వారని,అనివార్య కరణాల వల్ల దానిని యాజమాన్యం మూత వేయడంతో ఉపాధి కోల్పోయి మండలంలో ఉన్న ప్రజలను ఏ పని చేసుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నీటిసౌకర్యం,భూములు మండలంలో ఉన్నాయని మూతపడ్డ ఆ పరిశ్రమ స్థానంలో ప్రత్యామ్నాయంగా మరో పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు వేణుగోపాల్ తెలిపారు.దానికి సానుకూలంగా మంత్రి స్పందించాలని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో 98 డెంగీ కేసులు

తంబళ్లపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లాలో మొత్తం 98 డెంగీ కేసులు నమోదయ్యాయని అన్నమయ్య జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన తంబళ్లపల్లె మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలో 3 డెంగీ కేసులు నమోదు వివరాలను తంబళ్లపల్లె సీహెచ్సీ మెడికల్ అధికారి వెంకట రామయ్యతో అడిగి తెలుసుకొని నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. రాయచోటి డివిజన్లో 40 డెంగీ కేసులు, మదనపల్లె డివిజన్లో 39, రాజంపేట 15 కేసులు నమోదైనటున్న ఆయన వెలేకరులకు తెలిపారు. డెంగీ, మలేరియా దోమల లార్వా ప్రబలకుండా గ్రామాల్లోని ముందస్తు అబేట్ ద్రావనం పిచికారి, పైరత్రిమ్ పిచికారి లోపం దాగిన దోమలను సైతంనివారించవచ్చన్నారు. ప్రజలకు పలు రకాల సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రిచర్డ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

తంబళ్లపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఈఓఆర్డీ దిలీప్కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం సర్పంచ్లు, కార్యదర్శుల 2వ రోజు శిక్షణ శిబిరంలో పంచాయతీ పారిశుద్ధ్యం, మెరుగు, తాగునీటి క్లోరినేషన్, వ్యక్తి పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. పలువురు సర్పంచులు తమ పంచాయతీలలో కరెంటు బిల్లులు, ఇతర సమస్యలపై అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్, జూనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్, జూనియర్ అసిస్టెంట్ వివేకానంద, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూములను పారదర్శకంగా గుర్తించండి

తంబళ్లపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూములను పారదర్శకంగా గుర్తించడానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపి గుర్తించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. మంగళవారం ఆయన తంబళ్లపల్లె, పరసతోపు పంచాయతీలోని సర్వే నెంబర్ 11 74లోని ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షా సమావేశం జరిపారు. రెవెన్యూ అధికారులు వెబ్ ల్యాండ్ డీకేటీ భూములను గుర్తించి అందులో సొంతదారులు పంట సాగు చేస్తున్నారా లేదా బీడుగా ఉందా లేదా అమ్ముకోవడం జరిగిందా గుర్తించి సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు రమణ, శ్రీరాములు, మండల సర్వేయర్లు అల్తాఫ్, గణేష్, మండల రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వర్షపునీటితో నిండిన జగన్కాలనీ

మదనపల్లె, ఆగస్టు 13 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్ వద్ద నూతనంగా నిర్మించిన జగన్ హౌసింగ్ కాలనీలో రోడ్లు వర్షపునీరు నిండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం తెల్లవారిజామున కురిసిన వర్షానికి కాలనీలోని రోడ్డు వర్షపునీటితో నిండిపోయింది. రోడ్డంతా వర్షపునీరు ఉండడం వల్ల కాలనీలోని పిల్లలు, వృద్దులు ఇబ్బందులు పడ్డారు. కాలనీలో రోడ్లు సక్రమంగా లేకపోవడం వల్లే ఎప్పుడు వర్షం పడినా రోడ్డంతా వర్షపునీటితో నిండి ఉంటుంది. అంతేకాకుండా ఆ కాలనీలో తాగునీరు, రోడ్లు, మురుగునీటి కాలువలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే జగన్కాలనీ కాని మౌళిక వసతులు శూన్యమంటూ ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. గోవర్ధనగిరి శ్రీకృష్ణఆలయానికి వెళ్ళే పక్కనున్న జగన్ కాలనీలో మౌళికవసతులు కల్పించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

పంటలను పరిశీలించిన ఏడిఏ

నిమ్మనపల్లె, ఆగస్టు 13 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలోని పలు ప్రాంతాల్లో వరి, వేరుశెనగ పంటలను మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి మురళీమోహన్లు కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈఏ మాట్లాడుతూ ఈ ఖరీఫ్సీజన్లో సాగు చేసిన వరి, వేరుశెనగ పంట వివరాలను స్థానికరైతు బరోసా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని నిమ్మనపల్లె సింగల్విండో సిఈఓతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్,కుమార్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యోగబోగేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మివ్రతం

మదనపల్లెక్రైం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

ఈనెల 16న మదనపల్లె పట్టణంలోని శ్రీ యోగబోగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు టి.విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్క్లబ్లో ఆయన మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు వ్రతం ప్రారంభం అవుతుందన్నారు. కావున మహిళలు ఈ వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

రెండవరోజు అథ్లెటిక్ పోటీలు

మదనపల్లెక్రైం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

రీజనల్ స్థాయి అథ్లెటిక్ పోటీలు రెండు రోజులుగా నవోదయ విద్యాలయంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంగళవారం ప్రిన్సిపాల్ ఆనంద్రావ్ ఉదయం ప్రారంభించారు. అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని హైజంప్ 600మీటలర్లు 800మీటర్ల, 1500 మీటర్లు, 3వేల మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రిన్సిపాల్ గోవిందరావు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు జి.సురేంద్రరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్తిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

గాలివీడు, ఆగస్టు 13(ప్రభాతవార్త):

తెలుగుదేశం ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుండి ప్రారంభిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పూలికుంట గ్రామం రెడ్డివారి పల్లెలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొండారెడ్డి మనుమరాలి వివాహ రిసెప్షన్ విందుకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో రైతుల భూములను అన్యాక్రాంతం చేసి భూదందాలతో రైతులను నట్టేటా ముంచారన్నారు. రైతుల భూముల సమస్య పరిష్కారం కోసమే ఈ నెల 16 నుండి సెప్టెంబర్ 30వ తేదీల వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథి రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, టోపీవలి, హరినాథరెడ్డి, యువగళం సభ్యులు వెంకట్రామిరెడ్డి, సాయిప్రసాద్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా స్వర్ణోత్సవ జ్యోతి వేడుకలు

కలికిరి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

కలికిరి మండల కేంద్రంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.మంజుల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ జ్యోతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా.గోవిందస్వామి ముఖ్య అతిథిగా హాజరై స్వర్ణోత్సవ జ్యోతిని ప్రారంభించారు. భారత వ్యవసాయ పరిశోధన ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా పుదుచ్చేరిలో ప్రథమంగా కృషి విజ్ఞాన కేంద్రాలు 1974లో ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 731 కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సేవలందించి 50 సంవత్సరాలు పూర్తి కావడంతో స్వర్ణోత్సవ జ్యోతి వేడుకలు నిర్వహించడం జరిగిందని కలికిరి మండలం కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. ఈ వేడుకలు ఐసీఏఆర్ కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవేడుకల జ్యోతి సంబంధించిన వాటిని డా.గోవిందస్వామి కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం సిబ్బందికి అందజేశారు.

సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి

కలికిరి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, ప్రజలకు సైబర్ నేరాలపై, నకిలీ యాప్లపై అవగాహన కల్పించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రెడ్డిశేఖర్రెడ్డి మహిళా పోలీసులను ఆదేశించారు. మంగళవారం కలికిరి పీఎస్లో 14 పంచాయతీల ప్రజల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన విషయాలపై సీఐ విపులంగా వివరించారు. పంచాయతీల్లో ఎక్కడా అసాంఘిక కార్యక్రమాలు జరగడానికి వీలులేదన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మద్యం, జూదం లాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా తమకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. ఏఎస్సైలు మహబూబ్బాషా, మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుళ్లు రాజేంద్రప్రసాద్, కొండప్ప, మదనమోహన్రెడ్డి, మనోహర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం

కలికిరి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం మొత్తం మండలాల్లోని పంచాయతీల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ అదే విధంగా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులు మండలాల్లోని పంచాయతీల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించాలని ఆదేశించారు. కలికిరి మండలంలోని 14 పంచాయతీల్లో కలికిరి మండలం ఇన్ఛార్జి ఎంపీడీవో పరశురాం పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. మర్రికుంటపల్లెలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, గుండ్లూరు పంచాయతీలో సర్పంచ్ సైపుల్లా, అదే విధంగా అన్ని పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలికిరి పంచాయతీ ఈవో గురుమోహన్, కార్యదర్శులు గాయత్రి, మయూరి, తిమ్మారెడ్డి, గోవర్ధన్, పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

పీలేరు, ఆగస్టు 13 ప్రభాతవార్తః

స్థానిక మాలలు పెద్ద ఎత్తున దళితులకు రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగంగా సుప్రీంకోర్టు ద్వారా ఆగస్టు 01న వచ్చిన ఎస్సీ వర్గీకరణపై తీర్పును నిరసిస్తూ స్తానిక రెవెన్యూ కార్యాలయం ముందు గంటకు పైగా పెద్ద ఎత్తున దర్నా నిర్వహించి వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అని నినాదాలు పలికారు. అనంతరం స్థానిక తహశీల్దారు భీమేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించగా ప్రభుత్వానికి తెలియజేస్తామని సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ద్వారా వచ్చిన తీర్పు కేవలం రాజ్యాంగ విరుద్ధమని ఎన్నో దశాబ్దాల నుంచి రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగమే సుప్రీంకోర్టు తీర్పు, ఈ తీర్పు ద్వారా క్రిమిలేయర్ అంటూ రిజర్వేషన్ ఎత్తివేసే ఆలోచన మానుకోవాలని దీనిలో భాగంగా కులాల మధ్య చిచ్చు పెట్టే దిశగా మాల మాదిగలను విభజించే ప్రయత్నం చేస్తుంది. గతంలో కూడా ఎస్సీ వర్గీకరణ చేయాని ప్రయత్నం చేసినప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల దళితులు పెద్ద ఎత్తున చేసిన పోరాటం కంటే రానున్న రోజుల్లో లక్షలాదిమందితో తీర్పునకు వ్యతిరేకంగా పోరాటాలు మొదలవుతాయని ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ అంశంతోపాటు క్రిమిలేయర్ అనే అంశాలను పక్క పెట్టి తీర్పును పున: పరిశీలన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంఘాల నాయకులు ధరణ్కుమార్, సుభాష్, మల్లికార్జున భాను ప్రకాష్, సదాశివ, రాజేశ్వరి రెడ్డిరాణి, లోకనాదం, రవికుమార్, చలపతి, వెంకటరమణ, శ్రీనివాసులు, రవి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల చరిత్రను తిరగరాసిన మందకష్ణ మాదిగ

ఎస్సీ రిజర్వేషన్ విజయోత్సవ ర్యాలీలో పీలేరు ఎమ్మార్పీయస్ శ్రేణులు

పీలేరు, ఆగస్టు 13 ప్రభాతవార్తః

30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ కళను ఢిల్లీ గడ్డపై సాధించి నేడు తెలుగు గడ్డపై అడుగు పెట్టబోతున్న మహాజన నేత మాదిగల ఆరాధ్య దైవం వర్గీకరణ విజయసారధి మందకష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి వర్గీకరణ వ్యతిరేకుల గుండెలదిరేలా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో స్వాగతం పలకడానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి వేలాది మంది ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ అనుబంద సంఘాల నాయకులు అభిమానులు పాల్గొని డబ్బు దరువులతో చిందులతో మంద కష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికారు. ఈ విజయోత్సవ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి క్లాక్ టవర్చౌరస్తా, పాట్ని రాష్ట్రపతిరోడ్డు, బైబిల్ హౌస్, ట్యాంక్బండ్ అంబేద్కర్ విగ్రహం, బషారాబాద్రోడ్డు, చౌరస్తా మీదుగా బాబు జగజ్జీవన్ రావు విగ్రహం వరకు నిర్వహించే భారీ ర్యాలీ ప్రదర్శనలో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాలోని పీలేరు నియోజకవర్గం ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ ఇన్చార్జి గండికోట వెంకటేష్, ముల్లంగి రెడ్డెప్పరమణ, శ్రీనివాసులు, విశ్వనాధల ఆధ్వర్యంలో ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరితో పాటు కలకడ మండలం ఎంఎస్పీ నాయకులు శ్రీనివాసులు, రాజేష్, రెడ్డికుమార్, కేవి.పల్లె, గుర్రంకొండ నుంచి ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

మానవజాతికి మణిహారం ఆడబిడ్డ

పీలేరు, ఆగస్టు 13 ప్రభాతవార్తః

ఆడబిడ్డ జన్మించేది సంపూర్ణంగా జీవించడానికే అని, కావున ఆడబిడ్డ విద్య, ఆహారం, ఆరోగ్యం పట్ల వివక్ష చూప వద్దని ఆడ, మగ ఇద్దరు సమానమని తలపుల పీహెచ్సీ వైద్యాధికారి రమేష్రెడ్డి పురప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బోడుమల్లు వారిపల్లెగ్రామంలో డాక్టర్ రమేష్రెడ్డి అధ్యక్షతన ఆడబిడ్డల రక్షణ- మనందరి బాధ్యత అంశంపై సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. నేడు ఆడబిడ్డ వద్దనుకునే వారు గర్భదారణ సమయంలో స్కాన్ సెంటర్లకు వెళ్లి లింగ నిర్ధారణ సమయంలో స్కాన్ సెంటర్లకు వెళ్లి లింగ నిర్ధారణ చేసుకుని తద్వారా ఆడశిశువు అని తెలుసుకుని వెంటనే గర్భస్రావం చేయించుకొనుట వలన ఆడబిడ్డల శాతం మగ పిల్లల కంటే తగ్గడం వల్ల సమాజంలో తీవ్ర అసమానతలు ఏర్పడి సమాజాభివద్ధి కుంటుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు కుటుంబ శ్రేయస్సు సమాజ శ్రేయస్సు, దేశ భవిష్యత్తు దశ్య ఏ బిడ్డ అయినా ఒక్కటేనని అవగాహన కల్పించి ఆడపిల్లలను రక్షించి మానవజాతి మనుగడకు చేయూతనిద్దాం ఇది అందరి బాధ్యత అని లేనిచో బాధ్యులైన వారిపై చట్టపరమైన శిక్షలకు బాధ్యులవుతారని వైద్యులు రమేష్రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్ఎం రేణుక, సీహెచ్ఓ రాజేశ్వరి, నాగసుధ, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలి : ప్రిన్సిపాల్

పెనగలూరు,ఆగష్టు13,ప్రభాతవార్త :

మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఉండాలని ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ అన్నారు. మంగళవారం ఆమె పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో జాతీయ జెండా పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య నినోత్సవం నాడు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలన్నారు. జాతీయ జెండా యొక్క విషిష్టతను గ్రామస్థులకు వివరించారు. హర్ ఘర్ తిరంగా అని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీసీ హైస్కూల్లో ఘనంగా హర్ ఘర్ తిరంగ

పీలేరు, ఆగస్టు 13 ప్రభాతవార్తః

ఆజాదీకా అమత మహోత్సవ్లో భాగంగా విద్యార్థులతోపాటు ప్రజల హదయాలలో దేశ భక్తి భావాన్ని పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు హెచ్ఎం సావిత్రి తెలిపారు. చిత్తూరు 35 ఆంధ్రా బెటాలియన్ ఎన్సీసి వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వాల్మీకిపురం మండల కేంద్రంలోని పీవీసీ ప్రభుత్వ హైస్కూల్లో గౌరవ జిల్లా కలెక్టర్, డీఈఓల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు భారతదేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధానమంత్రి సూచించారన్నారు. జాతీయ జెండా ఎగురవేయడాన్ని ప్రోత్సహించేందుకు హర్ఘర్ తిరంగ కాలర్ట్యూన్స్ను అందరి ఫోన్లలో వినిపించాలన్నారు. విద్యార్థులు ప్రజలు త్రివర్ణ పతకాంతో దిగిన సెల్ఫీలను హర్ఘర్ తిరంగ వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. జాతీయ జెండాను ఎగురవేయడంలో వినియోగించడంలో జెండా గౌరవానికి భంగం కలగకుండా ఫ్లాగ్ కోడ్ గురించి తెలుసుకుని ప్రతి ఒక్కరు ఆనిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రధానమంత్రి మోడీ ప్రారంభించిన హర్ఘర్ తిరంగ ప్రచారం రెండేళ్లకే జాతీయ ఉద్యమంగా మారడం సంతోషంగా ఉందన్నారు. దేశ భక్తితో పాటు భారత జాతీయ జెండా గురించి విద్యార్థులకు అవగాహనను పెంచడానికి వారిచే వ్యాసరచన, వకత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్సీసీ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఇంటి స్థలాలు మాకు ఇప్పించండి

నందలూరు,ఆగష్టు 13,ప్రభాతవార్త:

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోగల అరవపల్లెలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానం అనుకొని ఉన్న తమ ఇంటి స్థలాన్ని ఓ వ్యక్తి మాకు తెలియకుండా ఆక్రమించి ఇట్లు నిర్మించారని మండల ఇంచార్జ్ తాసిల్దార్ మోహన్ కృష్ణకు కుంచపు లక్ష్మి నరసమ్మ(లక్ష్మీదేవి), వేపగుంట సామ్రాజ్లు అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు క్రీడా మైదానం పక్కన మూడు సెంట్లు స్థలం ఉంది. దానికి సంబంధించిన పత్రాలు కూడా మా వద్ద ఉన్నాయని అయినప్పటికీ ఆ వ్యక్తికి ఉన్న రాజకీయ నాయకుల పలుకుబడి కారణంగా మమ్మల్ని బెదిరించి భయపెట్టి మా స్థలంలో ఇట్లు నిర్మించడం దారుణం అని,తనకు అక్కడ ఎటువంటి స్థలము లేదని రెవెన్యూ రికార్డు లో మా పేర్లతో ఉన్న మాకు రెవెన్యూ అధికారులు కూడా మద్దతు ఇవ్వలేదని ఇన్చార్జి తహసిల్దార్ మోహన్ కృష్ణకు అర్జీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నందలూరు ఇన్చార్జి తాసిల్దార్ మోహన్ కృష్ణను వివరణ కోరగా ఆయన సమాధానం ఇస్తూ ఆ స్థలము చెరువు తట్టు అని, రికార్డులను పరిశీలించి మా పై అధికారులకు సమాచారం అందజేసి వీలైనంత త్వరలో దాని పరిష్కారం చేస్తామని తెలియజేశారు.

బ్రహ్మకుమారిస్ గోల్డెన్ జూబ్లి జయప్రదం చేయండి

మదనపల్లె క్రైం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

బ్రహ్మకుమారీస్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జయప్రదం చేయాలని మదనపల్లె బ్రహ్మకుమారీస్ ఇన్చార్జ్ పద్మావతి కోరారు. ప్రెస్క్లబ్లో మాట్లాడుతూ మదనపల్లె బొంతలవారి సత్రంలో ఈనెల 15న బ్రహ్మకుమారీస్ గోల్డెన్జూబ్లి సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెలబ్రేషన్స్ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ధరన్మాన్ని కాపాడితే ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుందని హితువు పలికారు.

నేడు ఇన్వెర్ ఓరియేంటేషన్కు హాజరుకండి

మదనపల్లెక్రైం, ఆగస్టు 13 ప్రభాతవార్త :

జిల్లాలోని మదనపల్లెలో ఒక్కరోజు ఇన్వెర్ నామినేషన్లు అవగాహన కల్పించుటకు బుధవారం ఉదయం 9గంటలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని డిఈఓ శివప్రకాష్రెడ్డి, డివైఈఓ శ్రీరామ్ పురుషోత్తం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, అన్ని ప్రైవేటు, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి ఒక్క ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు.

WANTED
Diplamo E.E.E.;BC-'E' for the Post of High Skilled Contract Labour.
Contact :
M/s SN Constructions, Kadapa

సప్తగిరి గ్రామీణ బ్యాంక్
ప్రధాన్మత్రి రంగ సంస్థ, ఇండియన్ బ్యాంక్ చే (ప్రాయోజితం)
రామసముద్రం శాఖ. సెల్: 9281088246.

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం పొందియున్నారు. గడువు మీరినను వారి అప్పు చెల్లించి నగలను విడిపించుకోవలసినదిగా పలుమార్లు నోటీసులు పంపినను స్పందించలేదు. కారణంగా బంగారు బ్యాంకు నిబంధనలను అనుసరించి 20.08.2024 తేదీ మంగళవారం నాటికి అప్పు చెల్లించి నగలు విడిపించుకోవలెనని తెలియజేయడమైనది. లేనిచో 21.08.2024వ తేదీ బుధవారం మధ్యాహ్నం 4 గం॥లకు బ్యాంకు ఆవరణలో వేలం వేయబడును.

షరతులు : 1) నోటీసులు అందనివారు ఇదే ఆఖరి నోటీసుగా భావించవలెను. 2) వేలములో పాల్గొనువారు 10,000/- ధరావతు సొమ్ము చెల్లించవలెను. 3) ఈ ప్రకటన ఖర్చు అప్పుదారుడే భరించవలెను. 4) వేలం పాక్షికంగా, పూర్తిగా రద్దు చేయుటకు సర్వహక్కులు కలవు, 5) వేలము వేసినను అప్పు మిగిలిన యెడల సదర

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలతో హోరెత్తిన పట్టణం

- జై భారత్-భారతమాతాకిజై అంటూ నినాదాలు - విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రముఖులు - నేడు అర్ధరాత్రి ఘనంగా స్వాతంత్ర్య సంబరాలు

మదనపల్లె, ఆగస్టు 13 ప్రభాతవార్త :

స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు సంబరాలతో పట్టణం హోరెత్తింది. ఓ వైపు విద్యార్థులు జాతీయజెండాలను చేతపట్టి భారీ ర్యాలీ, మరోపక్క కళాకారులచే నిర్వహించిన సాంస్కృతికకార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అధికారులు, పట్టణ ప్రముఖులు, విద్యాసంస్థల అధినేతలు విద్యార్థులు ర్యాలీలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు సంబరాల్లో పాల్గొన్నారు. జై భారత్, భారత్‌మాతాకి జై అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు పట్టణాన్ని దద్దరిల్లింపచేశాయి. వేలాది మంది విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల పోటోలను ప్రదర్శిస్తూ పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకొంది. గత రెండు రోజులుగా స్వాతంత్ర్య దినోత్సవం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిషన్‌కాంపౌండ్ నుంచి విద్యార్థులచే ఈ ర్యాలీ ప్రారంభమై గాంధీరోడ్డు, చిత్తూరు బస్టాండు, టౌన్‌బ్యాంకు సర్కిల్, అవెన్యూరోడ్డు, బెంగుళూరు బస్టాండు, అనిబిసెంట్ సర్కిల్, జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ర్యాలీ మార్గమధ్యంలో ఉన్న అనీబిసెంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదనపల్లెకు ప్రత్యేకత ఉండడంతో మూడు రోజులు పాటు ముందస్తు వేడుకలు జరుపుతున్నామన్నారు. దేశ భక్తిని, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నేటితరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14న బుధవారం పట్టణంలోని మహిళా సంఘాల వేలాదిమంది గ్రూపు సభ్యులతో మిషన్‌కాంపౌండు నుంచి టిప్పుసుల్తాన్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడే అర్ధరాత్రిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ ఖాజాబీ, విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ గురు ప్రసాద్, డాక్టర్ సేతు, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, కామకోటి ప్రసాద్‌రావు, గౌతంస్కూల్ లక్ష్మినారాయణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన జేసీ

రామాపురం, ఆగస్టు 13, ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రీ హోల్డ్ భూములను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేందర్ పరిశీలించారు. మండలంలోని గోపగుడిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 756/3ని ఫ్రీ హోల్డ్ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని రామాపురంలో ఉన్న సరస్వతిపల్లె సహకార బ్యాంక్ తనిఖీ చేశారు. బ్యాంకులో ప్రతి రైతుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేశారా లేదా అని ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4400 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములను గతంలో గుర్తించారని వాటిని పరిశీలించి అక్రమాలు జరగకుండా రైతులకు న్యాయం చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రామాంజనేయులు, ఆర్ఐ రవికుమార్, సొసైటీ సీఈవో నాగేశ్వర్‌రెడ్డి, మండల సర్వే నాగలక్ష్మి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండండి : జి.రమేష్

రామాపురం, ఆగస్టు 13, ప్రభాతవార్త:

చూటీ పశువులు గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కడప జిల్లా పశు గనాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి జి.రమేష్ అన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామం చెనిక్యాయలపల్లెలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధులు వాటి చికిత్స శిబిరం నిర్వహించి రైతులకు, పాడి పశువుల కాపరులకు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో రామకృష్ణుడు, ఈఓపీఆర్డీ ఉషారాణి, ఆర్ఐ రవికుమార్, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరుల త్యాగం.. భారతావని స్వాతంత్ర్యం..

కడప కార్పొరేషన్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం భారతావని స్వాతంత్ర్యం కోసం ఎందరో మహావీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వారందరి త్యాగ ఫలితంగానే ఈ దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అటువంటి త్యాగమూర్తులు నిరంతరం స్మరించుకోవాలని ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జేసీ అదితీసింగ్‌లు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం కడప నగరంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు మువ్వన్నెల జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. మోదీ ఇచ్చిన పిలుపఉ మేరకు ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. దేశం పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ కలిగి ఉండాలని జాతీయ భావాలు పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సింగారెడ్డి, రామచంద్రారెడ్డి, బాలకృష్ణయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, బొమ్మనా విజయ్, బొమ్మన సుబ్బరాయుడు, జంగిటి వెంకట సుబ్బారెడ్డి, చలపతి, హరినారాయణ, మునగా సతీష్, పవన్‌కుమార్, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, సురేంద్ర, శ్రీకాంత్, లక్ష్మీదేవి, జనసేన నాయకులు సుంకర శ్రీనివాసులు, టీడీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన నందన్

కడప కార్పొరేషన్, ఆగస్టు 13, ప్రభాతవార్త:

ప్రభుత్వం, పాలకవర్గం సహకారంతో కడప నగరాన్ని అభివృద్ధి చేస్తామని నూతన కమిషనర్ వై.ఓ.నందన్ తెలిపారు. కడప నగరపాలక సంస్థ పుల్ అడిషనల్ ఛార్జ్ (తాత్కాలిక) కమిషనర్‌గా ఓబులేసు నందన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌ను పలువురు ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ నందన్ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సీఎం చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖామంత్రి నారాయణ, సీఎండీ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై దృష్టి సారిస్తామనని పేర్కొన్నారు. మేయర్ సురేష్‌బాబు, పాలక మండలి సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

పొద్దుతిరుగుడు చిరు సంచులు రైతులకు ఉచితంగా పంపిణీ

పెండ్లిమర్రి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలంలోని ఇసుకపల్లె రైతు సేవా కేంద్రంలో పొద్దుతిరుగుడు చిరు సంచులను రైతులకు ఉచితంగా మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 6 క్వింటాళ్లు పొద్దుతిరుగుడు చిరు సంచులు మంజూరయ్యాయని కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకొని విత్తనాలను తీసుకెళ్లాలన్నారు. రైతులు వేసిన పంటను సంబంధిత రైతు సేవా కేంనరదంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరగామ వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో వంద మీటర్లు జాతీయ జెండాతో ర్యాలీ

రాయచోటి, ఆగస్టు 13, ప్రభాతవార్త:

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం రాయచోటిలోని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వంద మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో డీఆర్ఓ సత్యనారాయణ రావు, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం, డీఈవో శివప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ రామచంద్రరావు, డీఎఫ్ఓ అనిల్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ర్యాలీ అన్నమయ్య సర్కిల్ మీదుగా మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు నిర్వహించారు. శ్రీచైతన్య, రాజు, గిరిజన పాఠశాల, సాయి, సాయి ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ తదితర పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞను (త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తామని, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని గౌరవిస్తామని భారతదేశ అభివృద్ధి మరియు పురోగతికి అంకితం అవుతామని) జిల్లా పర్యాటక శాఖాధికారి నాగభూషణం ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు.

హనుమంతునికి ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ , ఆగస్టు 13 ప్రభాతవార్త :

పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండవ మంగళవారం పురస్కరించుకుని ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకం, సిందూరం అర్చన, ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఉభయదాతలుగా పెంచ లయ్య, సతీమణి లక్ష్మిదేవి, తులసి వెంకటశివ నారాయణ సతీమణి ఇందు మతి, బల్లిశెట్ట మస్తాన్ రాజ, సతీమణి వసంత లక్ష్మి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చే అబయాంజనేయ స్వామి వారిని పలువురు భక్తులు, భక్తి, శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయని ర్వాహకులు వివి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమేణ పాల్గొన్నారు.

బైపాస్‌రోడ్డు అలైన్‌మెంటులో అన్యాయం చేశారు

ప్రజాఫిర్యాదులో బాధితులు సబ్‌కలెక్టర్‌కు విన్నపం

మదనపల్లె, ఆగస్టు 13 ప్రభాతవార్త :

అంగళ్ళు బైపాస్‌రోడ్డు నిర్మాణ అలైన్‌మెంటులో తమకు అన్యాయం జరిగిందని బాధితులు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించుకొన్నారు. కురబలకోట మండలం కనసానివారిపల్లెకు చెందిన అర్జున్‌రెడ్డి సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేధికలో రోడ్డు అలైన్‌మెంటుకు సంబందించి సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ఫిర్యాదుల ప్రకారం అధికారులు కొందరి స్వార్థపరులతో కలసి అలైన్‌మెంటు మార్చడంతో మా సొంత భూమి సర్వేనెంబర్ 1061/3బిలో అధనంగా 22సెంట్లుకు నోటిఫికేషన్ ఇచ్చి రోడ్డు వేశారన్నారు. ఇందుకు సంబంధించి భూపరిహారం కూడా తీసుకోలేదన్నారు. అప్పటి ఆర్డీఓ ఎంఎస్.మురళి అలైన్‌మెంటులో అన్యాయం చేశారన్నారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చినా ఆర్డీఓ స్టే ఖాతరు చేయకుండా బైపాస్‌రోడ్డు వేశారన్నారు. అలైన్‌మెంటు మార్పు వల్ల తనకు రూ.2కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన భూ బాధితులు సబ్‌కలెక్టర్‌కు న్యాయం చేయాలంటూ ఫిర్యాదులు చేశారు. గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో ప్రజాసమస్యలపై 87అర్జీలు వచ్చినట్లు సబ్‌కలెక్టర్ వివరించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు.

ప్రధాన రహదారుల నిర్మాణ పనులు కొనసాగించాలి

**వేంపల్లె, ఆగస్టు 13, ప్రభాతవార్త ఃఃః